# ౨ సనాతన రాజరాజ నరేంద్రుడు

ప్రకృతి పరుడు పురాణపరుడు అను ఇద్దరు పురుషులు చెరియొక వైపునుంచి ఓనాటి సాయంకాలం సారంగధరుని మెట్టెక్కారు. ఇద్దర్నీ సరకు సేయకుండా సంధ్యారాగం బ్రహ్మాండమంతనూ ప్రజ్వరిల్ల చేస్తూ, గోదావరినది మీదుగా కానవచ్చే అద్దరి ఆకాశాన్ని చుట్టుగోలై కనుకట్టు గొలుపుతూవుంది. ఎఱ్ఱని బింబం ఎఱ్ఱని కాంతి మొయిళ్ళ మునిగితేల్తూ దేదీప్యమానంగా గోచరిస్తూవుంది.

అదే మొదటి పర్యాయం చూడ్డం అయివుంటే మానవుడైనవాడు "అయ్యో! జగద్బాంధవు డంతరించి పోతూవున్నాడే!" అని గోలు గోలున ఏడ్చేవాడే. కాని అలా సూర్యుడు క్రుంకిపోవడం, తిరిగి మర్నాడుదయిస్తూ వుండడం, మానవలోక మిప్పటి కెన్ని కోట్ల లక్షల వేల సంవత్సరాలనుంచి కనిపెడుతూ వచ్చిందో ఒక్కడూ విచారించడం లేదు. పైపెచ్చు "అహో! సంధ్యారాగమెంత చల్లగా ఎంత ఆర్ద్రంగా విలసిల్లి పోతూవుంది!" అని యెల్లరూ మెచ్చులు గురియించే వారే! మానవులే కాకుండా పక్షులుకూడా, తమ తమ కులాయాల్లోకి దూరిపోయే ముందు, ఓ పర్యాయం ఆ ప్రకృతి దేవి యొక్క పాటలనిటలాలంబరో లంబాలన, నల్లగా ఎగిరి యీ తట్టుకువచ్చేస్తున్నాయి. గాలి కమ్మగా

వీస్తూ వుంది. కాలపురుషుడు అమృతం త్రావుతూవున్న గడగడ శబ్ద గుంఫన మా అది, లేక ఆకాశం భూమి ప్రణయ సమ్మేళంగా కేళి క్రీడిస్తూ వున్నప్పటి మణితధ్వనులా అవి అన్నట్టు ఏతట్టువిన్నా అణగారి పోతూ, జాన పద గాన వినోద ప్రతిధ్వానాలు సరసుల హృదయాల్ని ఆవరించి కోమలభావాలు ప్రభవింప చేస్తూవున్నాయి.

× × ×

"అయితే చిత్రాంగి ?", అన్నాడు పురాణపరుడు. "సారంగధరుణ్ణి చూచావా ?" అన్నాడు ప్రకృతిపరుడు. "ఇదుగో ! రాతి రూపంగా ఇక్కడ పడివున్నాడు ఈ కొండమీద" నన్నాడు పురాణపరుడు. ప్రకృతి పరుడారాతిని జూచి అత్యాశ్చర్యపోయినాడు. రెక్కలు మొలిచి పైకెగిరి పోతూవున్నట్టుంది. కాళ్ళు తెగి నేల పడి పోతూవున్నట్టుంది ఆ రాయి. "ఈలాగ్గా కాళ్ళు తెగి రాయి యిక్కడ కనిపిస్తూవుంటే చరిత్రకారులు సారంగధరుని గాథ యీపుర సంబంధమైనది కాదని యెట్లా చెప్పగలరో నాకు బోధపడకుండావుంది" అన్నాడు పురాణపరుడు.

ఆ యిద్దరున్నూ మఱికొంత దవ్వు ఆ కొండమీదనే త్రచ్చాడినారు. అప్పుడు వారికంటి కొక కొత్తగా నిర్మింపబడుతూవున్న దేవళమున్నూ, దాని కనతిదూరాన్నే ఇద్దరు తలవరులు కత్తులుచ్చుకు నిలబడ్డ మాదిరి విగ్రహాలున్నూ పొడగట్టినాయి. తలవర్లుగల స్థలంచాయనే ఒక నూతన గృహ నిర్మాణం కొలదిపాటి పూలమొక్కల్తో విరాజిల్లుతూ కనిపించింది.

"చరిత్ర ఎంతకాదంటూవున్నా చూచావా ఏలా విలసిల్లి పోతూ వుందో పురాణం !" అన్నాడు పురాణపరుడు. ప్రకృతిపరుడు దేని

కోసమో అన్నట్టు నలుదెసలా పరకాయించేడు. ఆ చూపు మార్గాన్నే పుచ్చుకు పురాణపరుడుకూడా చూచి చూచి అన్నాడు "ఆ లోయలో ఆ కనబడే దిగుచాయను ఆ గ్రామ పరిసరంలో అనగా నేడుకాతేరు అనబడే ఊరిసమీపంలో చిత్రాంగి కప్పెట్ట బడిందని వాడుక. మనకింక ఆమె కనబడదనుకుంటాను" అన్నాడు.

ప్రకృతి పరుడడిగేడు "ఈ రెక్కలు చెక్కిన రాయిని సారంగ ధరునిగా నీవు భావించ గలిగినప్పుడు ఆ పాతిపెట్టబడ్డ చిత్రాంగి పైకి అనురాగం జిమ్ముతూ సంధ్యారాగం రూపేణా మనకగుపిస్తూ వుందని ఎందుకు ఊహించకూడదోయి" — పురాణపరుడు "నిజమే! చిత్రాంగి! చిత్రాంగి! ఆ సంధ్యారాగం కూడా చిత్ర చిత్ర స్నిగ్ధ వర్ణమై శోభిస్తూ వుంది. అదే చిత్రాంగి అని మనం తలపోసినా తప్పులేదు. కాని చిత్రాంగి నెగనో పిల్లగా దిగనో పిల్లగా కోసి పాతి పెట్టారని ఉప్పు పాతర వేశారని పురాణ గాథ. ఇక అనురాగానికి తావెక్కడ ?" అన్నాడు.

ఆ అసహ్యమైన కథాభాగం తన చెవికి సోకిన వెంటనే ప్రకృతి పరునిలో క్రోధమూ శోకమూ ఒక్కుమ్మడిగా వుదయించినవి.

"అట్లా అయితే చిత్రాంగి యొక్క చిత్రవధ సంబంధమైన నెత్తురే అలా అపరసాంధ్యారుణ రక్తమై చిరస్థాయిగా రోజూ కానవస్తూ వుంది అని తలపోసికో" అన్నాడు.

ఆ మాటకు పురాణపరుడు "తొందరపడి సిద్ధాంతీకరించకు. మఱి అక్కడ నెత్తురుపుడుతూంటే ఇక్కడ యీ సారంగధరుని కాళ్లు తెగిన చోటకూడా నెత్తురు పుడుతూనే వుండాలి" అన్నాడు.

"ఈ కొండవెనుక ఉదయభాను డుదయించడు మఱి ?" అన్నాడు ప్రకృతిపరుడు.

పురాణపరుడన్నాడు "ఇంత వేళాకోళంగా దీన్ని గుఱించి నీవు పలకడాని క్కారణం మనకళ్ళ యెదుట యీ గుడి నిర్మింపబడుతూ యీ తలవరుల బొమ్మలు ప్రతిష్ఠింపబడ్డాయి కనుక. లేకపోతే ఇన్నాళ్ళ నుంచి ఓ మూల చెట్టుక్రిం దాసారంగధరుని విగ్రహం పడివుంటే అని యున్నావా ?" అని.

ప్రకృతిపరుడు వెంటనే వాక్రుచ్చేడు "నన్నిప్పుడు నీవు బాగా అర్థంచేసుకున్నావు. ఈ నూతన నిర్మాణాలు నూతన గ్రంథాలు మనకు పురాణగాథలందున్న గౌరవాన్ని పోగొడుతూవున్నాయి. ఈ కొండ వెనుక నొక బందిఖానావుంది కనక సారంగధరుని నాటకంలోని కొక జైలుసీను ఎక్కించేసి పవిత్రమైన సంస్మృతిని రేప్ కేసుగా మార్చి నాటకం ఆడేరు".

"పాత పురాణాల్లోంచి కొత్త పురాణాలు కొత్త పురాణాల్లోంచి క్రొంగొత్త పురాణాలు ఇలాగ్గా పుడుతూనే వుంటాయి" అన్నాడు పురాణపరుడు. ప్రకృతిపరుడు వెంటనే అందుకొని అంటున్నాడు "పురాణాలు పనికి రావనను. నిజంగా వాటివల్లనే కళ లోకంలో అభివృద్ధి అవుతూవుంది. కాని ఆ పురాణాలకు సంబంధించిన ఆదిమ గాథల్ని అతి యిదిగా మార్చి ప్రతిదానికీ వొక కట్టడమూ వొక విగ్రహము తయారు కావించడమనేది అనవసరం వృథావ్యయమూను. ఈ సారంగధరుని కొండ నేనెప్పుడెక్కినా అసలు మీరంతా ఎక్కివచ్చే మెట్లదారమ్మట ఎక్కనే ఎక్కను. కొండకు తూర్పు తట్టున వున్నటు

వంటి అడివిగుండా నడచివచ్చి పూర్ణచంద్రుణ్ణి తలపోస్తూ కూర్చుంటాను. ఆ తలపోత లోనే నాకు సారంగధరుడు తట్టుతూ వుంటాడు గాని యీ రాయీరప్పా నాకు ఎటువంటి సంస్మృతినిన్నీ తీసుకొని రాజాలవు. మఱీన్నీ పాతేరు అన్నదాని వృత్తాంతం వినడమంటేనే నా కసహ్యం. ఆ లోయవైపు అతి సుందరంగా సంధ్యారాగం సాయంతనం లేస్తూ చిత్ర చిత్ర వర్ణాలతో కనిపిస్తూవుంటే అదే చిత్రాంగిగా భావిస్తూవుంటాను. ఇటువంటి ప్రకృతి దృశ్యాలకు అడ్డంకులుగా గుళ్లూ ఇళ్లూ దళ్లూ ఈ కొండమీద కట్టడమనేది మంచిదికాదని నా తాత్పర్యము" అని ఉపన్యాస ధోరణిగా సెలవిచ్చాడు.

"మఱీ రాజరాజ నరేంద్రుణ్ణి ఎక్కడ చూడగల్గుతున్నావోయి ఈ ప్రకృతిలో?" అని అడిగేడు పురాణపరుడు.

ప్రకృతిపరుడు జవాబు చెప్పేడు "రాజరాజ నరేంద్రుడు అనే మహానుభావుడు పురాణంలోనూ లేడు, ఇంక ప్రకృతిలోనూ లేడు. చరిత్రకారులకుకూడా దొరుకుతాడనుకోను. అతని కోటశిథిలాలయొక్క గుట్టలు తవ్వి చదునుచేసి పారేశారు. అతని తాలూకు కందకం పెంటతో పూడ్చివేసినారు. అతను వేటాడిన అడివి చెలిపి అక్కడ గోల్ఫ్ గ్రౌండ్సు తయారు చేశారు".

"గోల్ఫ్ గ్రౌండ్సు? మనవూళ్లో?" అన్నాడు పురాణపరుడు.

ప్రకృతిపరుడు "అవును. వాటిని అడ్డమడే నే నిప్పుడు వచ్చింది. ఆ ప్రక్కగా సెంట్రల్ జెయిలు కెదురుగా వున్నాయి" అన్నాడు. "నే నెప్పుడూ చూడలేదు" అన్నాడు పురాణపరుడు. "చూచివుంటే

రాజరాజ నరేంద్రుడు వేటాడి విశ్రమించిన చదును భాగాలని అని యుందువు" అన్నాడు ప్రకృతిపరుడు.

పురాణపరుడు "అంతే నోయి! ఈ పురాణాలన్నీ అంతే నోయి. పుక్కిటి పురాణాలు. కాని నీవన్నప్పటినుంచీ నాకా గోల్ఫు గ్రౌండ్సు చూడాలనివుంది" అన్నాడు.

× × ×

అలా ఆ యిద్దఱూ అనుకుంటూ మసక సంజలో నడచి నడచి గోల్ఫు గ్రౌండ్సు అడ్డమడి వస్తూవున్నారు పట్నంలోకి — పెద్ద మానవ కారం అడ్డొచ్చినట్లుయింది! రాజరాజ నరేంద్రుడు!

చీకటి అనే మహత్పదార్థమును అచ్చుకట్టి నిలిపినట్టు గోచరించింది ఆ నిలువు విగ్రహం. దాని నీడ మఱీ చీకటి రూపం దాల్చి పట్నాన్నంతనూ ఆచ్ఛాదించినట్టుగావుంది. అది ట్రంకురోడ్డంట నడచి పోతూ వున్నట్టుంది. ఎక్కడకో? కాశీక్కావచ్చు. కైలాసానిక్కావచ్చు.

అతగాడు తలెత్తినా నిల్చి జైలుగోడల్లో తొంగిచూస్తూ పెద్ద పెద్ద అంగలేస్తూ వున్నాడు! ఎంత ఎంత అంగ అనుకున్నారు! చెట్టు చెట్టు కొక్కొక్క అంగ! సనాతన వటవృక్షాలవి! సనాతన రాజరాజ నరేంద్రు డితడు!

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 22—1—1938 | రాజమహేంద్రవరము | "ఢంకా"లో |